నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 9 జూలై 2024 | SURYAPET

ప్రజల నుంచి వినతి పత్రాలు తీసుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సమస్యలన్నీ పరిష్కరిస్తా

- నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి ప్రజా దర్బార్

నల్లగొండ, జూలై 8 : నల్లగొండలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్‌కు సోమవారం వినతులు వెలువత్తాయి. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం సమీపంలో గల మున్సిపల్ పార్కులో మంత్రి మూడు గంటల పాటు ప్రజా దర్బార్ నిర్వహించారు. నల్లగొండ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వివిధ సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను ఓపికగా విన్న మంత్రి కొన్ని సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కొంతమంది పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

అర్హులందరికీ పథకాలు అందాలి

- కలెక్టర్ నారాయణ రెడ్డి

నల్లగొండ, జూలై 8 : అన్ని ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ఆయన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శాఖకు కొన్ని లక్ష్యాలను నిర్దేశించిందని, వాటి సాధనకు కృషి చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు ప్రభు త్వం ప్రకటించే ప్రాథమ్య పథకాలు సైతం యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని తెలిపారు. జిల్లా అధికారులందరూ మండలాల ప్రత్యేక అధికారులుగా ఉన్నందున వీలైనంత ఎక్కువ సేవలు ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పా రు. విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాలని, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేయాలని, అంగన్వాడీ కేంద్రాలను సైతం తనిఖీ చేయాలని తెలిపారు. పెన్షన్లు తదితర లబ్ధి కోసం వచ్చిన వారితో మంచిగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించేందుకు చూడాలన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులన్నింటినీ జాప్యం లేకుండా పరిష్కరించాలని తెలిపారు. వనమహోత్సవం ప్రారంభమైనందున ప్రతి శాఖకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకునేలా మొక్కలు నాటాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు నిర్వహించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాల్సిన మందులు, తదితర వాటిపై సమీక్షించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి పూర్ణచంద్ర, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి

- సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సీనియర్ సిటిజెన్స్ వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట, జూలై 8 : జిల్లా యువతను గంజాయి, ఇతర మత్తు పదార్థాల నుంచి అప్రమత్తం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫెరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్ కోర్డ్ జిల్లా స్థాయి సమావేశంలో సోమవారం అదనపు ఎస్పీ నాగేశ్వరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రాకుండా అన్ని చెక్ పోస్టుల్లో గట్టి నిఘా పెంచాలన్నారు. పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో గంజాయి పంటల సాగును గుర్తించి ధ్వంసం చేయాలన్నారు.

సీనియర్ సిటీజెన్స్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

మెయింటెనెన్స్ కేసులను ఫైల్ చేసే ప్రక్రియ ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉండేలా ప్రభుత్వం వెబ్ పోర్టల్‌ను ప్రారంభిచిందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. కలెక్టరేట్‌లో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన ఈ పోర్టల్‌ను జిల్లాలో ప్రారంభించి మాట్లాడారు. వృద్ధులు, తల్లిదండ్రులు తమకు కావాల్సిన పోషణ భృతి కోసం ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. https://tgseniorcitizens.cgg.gov.in పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వృద్ధులను వేధించినా, హింసించినా, నిరాదరణకు గురి చేసినా చర్యలు తీసుకుంటారని చెప్పారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ కేసుల మానిటరింగ్ సిస్టమ్ ఆధ్వర్యంలో ఈ పోర్టల్ నడుస్తుందన్నారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ సురేశ్‌కుమార్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, అదనపు ఎస్పీ బీఎస్ లత, సంక్షేమ అధికారిని వెంకటరమణ, డీఈఓ అశోక్, డీడబ్ల్యూవో వెంకటరమణ పాల్గొన్నారు.

'హద్దులు' దాటుతున్న రేషన్ బియ్యం

- రీ సైక్లింగ్ చేసి గుజరాత్‌కు ఎగుమతి
- కీలక పాత్ర పోషిస్తున్న సివిల్ సప్లయ్ గోదాము ఇన్‌చార్జీలు
- రేషన్ షాప్‌లకు రాకుండానే మాయం
- కేజీ బియ్యం రూ. 6 నుంచి రూ. 8కి కొనుగోలు
- మాముళ్ల మత్తులో అధికారులు
- 100కి సమాచారం ఇస్తే దళారులకు చేరినట్లే!

అక్రమంగా ఆంధ్రాకు తరలింపు

పేదలు ఆకలితో పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆయా కుటుంబాలకు సరిపడా పీడీఎస్ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్నాయి. కొంత మంది దళారులు రేషన్ దుకాణాలు, గోదాముల నుంచి కొంత ఆశచూపి ఆ బియ్యాన్ని సరిహద్దులు దాటించి అక్రమార్జన పొందుతున్నారు. కృష్ణా తీరం, రెండు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ దందాకు మరింత ఊతమిస్తున్నది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల, మఠంపల్లి, చింతపాలెం, పాలకవీడు, హుజూర్‌నగర్, మేళ్ల చెర్వు మండలాలతో పాటు నల్లగొండ జిల్లా దామరచర్ల నుంచి ఎక్కువ మొత్తంలో రేషన్ బియ్యం లారీల్లో తరలిస్తున్నారు. బడా వ్యాపారుల ప్రలోభాలకు లొంగిన పల్లెల్లోని కొందరు అమాయకులు బియ్యం సేకరించే దందాను కుటీర పరిశ్రమగా మార్చుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 6న దామరచర్లలో పట్టుబడిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యంలో హుజూర్‌నగర్‌లోని మార్కెట్ గోదాము ఇన్‌చార్జి, నేరేడుచర్లకు చెందిన పలువురు రేషన్ డీలర్లపై కేసు నమోదవడమే ఇందుకు నిదర్శనం.

– నేరేడుచర్ల, జూలై 8

హుజూర్‌నగర్ నుంచి అక్రమంగా తరలిస్తూ దామరచర్ల వద్ద పట్టుబడిన రేషన్ బియ్యం లారీ (ఫైల్)

పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు పక్కదారి పట్టిస్తూ దందా సాగిస్తున్నారు. యథేచ్ఛగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ పరిస్థితి కృష్ణా తీర ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నది. మధ్యతరగతి, ఆర్థికంగా ఉన్నవారు పీడీఎస్ బియ్యం తీసుకోకపోవడంతో దళారులు గ్రామాల్లో వాలిపోయి కిలో బియ్యం రూ. 6 నుంచి రూ. 8 చెల్లించి పెద్దఎత్తున సేకరిస్తున్నారు. నిత్యం ఎక్కడో ఒక దగ్గర పట్టుబడుతున్నా వారి తీరు మారడం లేదు. వీరు ఈ దందాను కొనసాగించడం కోసం అధికారులకు పెద్దఎత్తున మాముళ్లు ఇస్తున్నట్లు తెలుస్తున్నది. అంతే కాకుండా కొంత మంది అధికార పార్టీ నాయకులు వీరికి మద్దతుగా నిలిచి ప్రోత్సహిస్తున్నారు. వారే దగ్గర ఉండి సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. పీడీఎస్ బియ్యంలో అవినీతి, అక్రమాలు జరిగితే సహించేది లేదని హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల జరిగిన సమావేశంలో కూడా హెచ్చరించారు. తమ పార్టీ వారైనా సరే ఊరుకోనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కొంత మంది అధికారులు నిద్రమత్తు వీడడం లేదు. మామూళ్లకు అలవాటు పడిన వారు తీరు మార్చుకోవడం లేదు. ఇప్పటికైనా దళారులకు కొమ్ముకాస్తున్న అధికారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గోదాము నుంచే నేరుగా తరలింపు

రేషన్ దుకాణాలకు తరలించే పౌర సరఫరా గోదాము నుంచే నేరుగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం ప్రజలకు అందించే రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారుల ద్వారా ప్రతి నెలా రేషన్ దుకాణాలకు చేరుతున్నది. అయితే సివిల్ సప్లై అధికారులు ఈ రేషన్ షాపుల పరిధిలోని కార్డులను బట్టి ఏ షాపునకు ఎంత రేషన్ బియ్యం అందించాలో ఆ లెక్క ప్రకారం గోదాములో కాంటా వేసి లారీల ద్వారా డీలర్లకు అందజేస్తారు. ఈ రేషన్ బియ్యాన్ని అక్కడ ఉన్న కార్డుదారులకు డీలర్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది. కార్డు ఉన్న వారిలో కొంత మంది రేషన్ బియ్యం మంచిగా లేక పోవడంతో తీసుకోరు. మరికొంత మంది రేషన్ బియ్యం తినలేక ఆ బియ్యాన్ని డీలర్లకే కేజీకి రూ. 6 నుంచి 8 వరకు విక్రయిస్తారు. ఇదే అదునుగా భావించిన రేషన్ డీలర్లు ప్రతి నెలా ఎంత కోటా సరిపోతుంది అనే విషయాన్ని ముందస్తుగానే గుర్తించడంతో ఆ మిగులు బియ్యాన్ని రేషన్ షాపులకు రాకుండానే డీలర్లు గోదాము వద్ద ఉన్న అధికారులకు ముడుపులు ఇస్తూ అక్కడే నిల్వచేసి లారీల ద్వారా రాత్రి సమయంలో ఆంధ్రా ప్రాంతాలకు నేరుగా తరలిస్తున్నట్లు తెలుస్తుంది. అంతే కాకుండా కొంత మంది దళారులు విడివిడిగా కొనుగోలు చేసి ఒక చోటకు చేర్చుతారు. ఎక్కువ మొత్తంలో కాగానే వాటిని లారీలకు ఎత్తుతున్నట్లు తెలుస్తుంది. ఈ విధంగానే ఇటీవల దామరచర్ల వద్ద లారీలోని 22 టన్నుల బియ్యం పట్టుబడింది.

ఆంధ్రా వ్యాపారుల పాత్ర

ఆంధ్రా సరిహద్దు ప్రాంతాలైన కృష్ణ పట్టి మండలాల్లో ఈ దందా ఎక్కువ మొత్తంలో జరుగుతున్నది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ దందా జోరుగా కొనసాగుతున్నది. రేషన్ బియ్యం కొనుగోలులో ఆంధ్రాకు చెందిన వ్యాపారులే ప్రధాన పాత్ర పోషిస్తున్నారను. పిడుగురాళ్లకు చెందిన ముగ్గురు ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు సమాచారం. వీరిపై ఇప్పటికే చాలా కేసులు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైనట్లు తెలుస్తున్నది. అధికారులకు ముడుపులు ఇస్తూ వారి దందా కొనసాగిస్తున్నారు. కొంత మంది రేషన్ డీలర్లను మచ్చిక చేసుకొని వారి నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి ఆటోలు, టాటా ఏస్‌లలో ఒక చోటకు తరలించి పెద్దఎత్తున నిల్వ చేసి అర్ధరాత్రి లారీల్లో ఆంధ్రాకు తరలిస్తున్నారు. వీరు జైలు శిక్ష అనుభవించినప్పటికీ వారు మాత్రం ఈ దందాను ఆపడం లేదంటే దీనిలో ఎంత లాభాలను ఆర్జిస్తున్నారో అర్థమవుతున్నది.

100కి ఫోన్ చేస్తే దళారులకు సమాచారం

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని 100కి డయల్ చేసి సమాచారం అందిస్తే వెంటనే అక్రమంగా సరఫరా చేసే దళారులకు తెలిసిపోతుంది. అది ఎలా అంటే 100కి సమాచారం అందిన వెంటనే అది ఏ మండల పరిధిలోకి వస్తే ఆ పోలీస్ స్టేషన్‌కు, ద్విచక్రవాహనంపై తిరిగే బ్లూకోర్టు వారికి సమాచారం అందిస్తారు. వెంటనే బైక్‌పై తిరిగే బ్లూకోర్టు సిబ్బంది దళారికి ఫోన్ చేసి చెప్తున్నారు. 'మీరు బియ్యం తీసుకెళ్తున్నట్లు 100కి ఫోన్ చేశారు.. మేము వస్తున్నాం.. మీరు అక్కడి నుంచి వెళ్లిపోవాలి' అని సూచిస్తున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న పోలీస్ సిబ్బంది ఎవరో తప్పుడు సమాచారం అందించారని, ఇక్కడ ఎవరూ లేరని పై అధికారులకు తెలుపుతున్నారు. దీనికి గానూ వారికి భారీ స్థాయిలోనే ముడుపులు అందుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలపై ఎస్కార్ట్

రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడేవారు ముందుస్తుగా నిఘా ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం. వారి వెళ్లే దారిలో ఎవరైనా అధికారులు ఉన్నారా లేదా అనే విషయాన్ని పసిగడుతారు. దీని కోసం అక్రమార్కులు ముందస్తుగా ద్విచక్ర వాహనంపై వెళ్తూ వెనుకాల వచ్చే బియ్యం వాహనానికి ఫోన్‌లో సూచనలు చేస్తుంటారు. ఎక్కువగా రాత్రి వేళల్లో, తెల్లవారు జామున రవాణా చేస్తున్నారు. ఇక ఆటోలు, టాటా ఏస్‌లో అయితే పట్టపగలే వెళ్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

రీసైక్లింగ్ చేసి గుజరాత్‌కు తరలింపు

తెలంగాణ నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఆంధ్రాకు తరలిస్తున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి కేంద్రంగా చేసుకొని రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి గుజరాత్‌కు, వైజాక్ పోర్టుకు తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇక్కడ రూ. 6 నుంచి 8కి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆంధ్రాలో రీసైక్లింగ్ చేసి నూకను వేరు చేస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి రూ. కేజీ బియ్యం రూ.28 గుజరాత్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. దాంతో వారు పెట్టే ఖర్చుకు పోను ఎక్కువ మొత్తంలో లాభం ఉంటుంది. ఈ దందాకు దాచేపల్లి ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండదండలతోనే సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. వీరి అక్రమ దందాను ఆపేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినా ఆగే పరిస్థితి లేదు. గతంలో వీరిని పట్టుకునేందుకు వెళ్లిన ఉమ్మడి జిల్లాకు చెందిన సంబంధించిన పోలీసులపై కూడా వీరు దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయి.

లోపించిన పోలీస్ నిఘా

పోలీస్ వ్యవస్థలో నిఘా లోపించడం వల్లే రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అధికారుల కళ్లుగప్పి రేషన్ బియ్యం అంధ్రాకు తరలిస్తున్నారు. గతంలో రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించేవారు. ఎవరైనా అనుమాన వ్యక్తి కనబడితే వివరాలు సేకరించేవారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. గతంలో మాదిరిగా రాత్రి సమయంలో పోలీసుల గస్తీని పెంచి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల పట్టుబడిన బియ్యం

- నేరేడుచర్ల మండలంలో గత నెల 19న ఆటోలో తరలిస్తున్న 3.2 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 28న ప్యాసెంజర్ బొలెరో వాహనంలో ఆరు బస్తాలు, ఈ నెల 18న ఆటోలో 3 క్వింటాళ్ల బియ్యం పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు.
- గరిడేపల్లి మండలంలో గత ఫిబ్రవరి 17న 20 క్వింటాళ్లు, మార్చి 15న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. హుజూర్‌నగర్‌లో 13 క్వింటాళ్లు, మఠంపల్లి మండలం గుండ్లపల్లిలో 30 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు.
- పాలకవీడు మండలంలో మార్చి–28న 8 క్వింటాళ్లు, జూన్ –14న 37 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

బియ్యం అక్రమ రవాణా కేసులో ఆర్ఐ అబ్దుల్ నబీ సస్పెన్షన్

హుజూర్‌నగర్ గోదాము నుంచి బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న లారీని దామరచర్ల వద్ద పట్టుకున్న సంఘటనలో గోదాము ఇన్‌చార్జి ఎస్‌కే అబ్దుల్ నబీ హస్తం ఉందని తేలడంతో సోమవారం సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సివిల్ సప్లయ్ అధికారులు హుజూర్‌నగర్ ఎంఎల్ఎస్ గోదాము పాయింట్‌లో తనిఖీ చేసి 424 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండడంతో ఆ నివేదిక ఆధారంగా అబ్దుల్ నబీని చేసినట్లు అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికడితాం

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తాం. అక్రమ రవాణాను అరికడుతాం. అన్ని రేషన్ దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలిస్తున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు తెలిస్తే వారిపై చర్యలు తప్పవు. అంతేకాకుండా వారికి సహకరించిన ఉద్యోగులు, రేషన్ డీలర్లను సస్పెండ్ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.

-రాములు, డీఎస్‌ఓ, సూర్యాపేట

మఠంపల్లిలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మఠంపల్లి : మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన 35క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎస్సై రామాంజనేయులు సోమవారం పట్టుకున్నారు. మఠంపల్లికి చెందిన వంగవీటి చిన్న రామయ్య ఇంట్లో సుమారు 15 క్వింటాళ్లు, తవనం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో 20క్వింటాళ్లు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మఠంపల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం

బుద్ధవనం సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

మహా స్తూపంలోని ధ్యాన మందిరంలో ట్రైనీ ఐపీఎస్‌ల బృందం

నందికొండ, జూలై 8 : నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సోమవారం ట్రైనీ ఐపీఎస్‌ల బృందం సందర్శించింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఓరియంటేషన్ ట్రైనింగ్‌లో భాగంగా వారు నందికొండకు వచ్చారు. బుద్ధవనంలోని బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించారు. బుద్ధ చరిత వనం, మహాస్థూపం, ధ్యాన మదిరాన్ని సందర్శించారు. ట్రైనీ ఐపీఎస్‌లు ఉమా హారతి, మనోజ్, సంకేత, మృణ శ్రేష్ఠ, అభిజ్ఞాన్ మాలవీయా, అజయ్‌యాదవ్‌తో పాటు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నోడల్ అధికారులు శ్రీనివాస్, పి. వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ కోటేశ్వర్ రావు, విజయవిహార్ మేనేజర్ కిరణ్, టూరిజం గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా వాసులకు కార్పొరేషన్ పదవులు

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నగరిగారి ప్రీతమ్
- రాష్ట్ర మహిళా సహకార సంస్థ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి

నగరిగారి ప్రీతమ్

బండ్రు శోభారాణి

యాదగిరిగుట్ట, జూలై8 : రాష్ట్ర మహిళా సహకార సంస్థ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఆలేరుకు చెందిన బండ్రు శోభారాణిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాలపాటు చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రామాయంపేట పరిధికి చెందిన శోభారాణి ఆలేరుకు చెందిన బండ్రు భాస్కర్‌ను జనశక్తిలో పనిచేసే సమయంలోనే వివాహం చేసుకున్నారు. ఆలేరు రాజకీయాల్లో క్రీయాశీలకంగా వ్యవహరించారు. బీఆర్ఎస్, టీడీపీ, బీజేపీలో పలు హోదాలో పని చేశారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఆలేరు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ప్రస్తుతం టీపీసీసీ ఉపాధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నగరిగారి ప్రీతమ్

మోత్కూరు, : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా మోత్కూరు మున్సిపాలిటీకి చెంది న నగరిగారి ప్రీతమ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి సోమవారం ఉత్వర్వులు జారీ చేశారు. ప్రీతమ్ నియమాకం పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, పార్టీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా రమేశ్‌రెడ్డి బాధ్యతలు

సూర్యాపేట రూరల్, జూలై 8 : తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేశ్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని టూరిజం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పటేల్ రమేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

శక్తివంచన లేకుండా ప్రజా సేవ

- ఐదేండ్ల జడ్పీ వైస్ చైర్మన్ సంతృప్తినిచ్చింది
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారం
- మరువలేను
- ఆత్మకూర్.ఎస్ ప్రజలకు రుణపడి ఉంటా : మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణగౌడ్

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ

మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పదవులు చేపట్టిన తనకు గత ఐదేండ్లు ప్రజలకు చేసిన సేవ ఎంతో సంతృప్తి ఇచ్చిందని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణ గౌడ్ అన్నారు. నిత్యం భుజం తడుతూ ప్రోత్సహించిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి వల్లే ఇది సాధ్యమైందని. ఆత్మకూర్.ఎస్ మండల ప్రజలకు ఎల్లవేళ లా రుణపడి ఉంటానని తెలిపారు. ఇటీవల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో వెంకట నారాయణ గౌడ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే.. – ఆత్మకూర్.ఎస్, జూన్ 8

'మా తాతలు రాజకీయాల్లో ఉండేది.. మా జనరేషన్ మొత్తం ఇంట్లో ఉంటూ చుదువుకునే వాళ్లు. నాకు మాత్రం ప్రజలకు ఏదో చేయాలనే ఆలోచన ఉండేది. అందుకే ఆ రోజుల్లోనే ఎస్వీ డిగ్రీ కళాశాలలో క్లాస్ రిప్రజెంటేటివ్‌గా ఏకగ్రీవం అయ్యాను. అనంతరం ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేసి, 1995లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆత్మకూర్.ఎస్ జడ్పీటీసీగా బరిలో నిలిచి గెలిచాను. 1996లో స్కూల్ అసిస్టెంట్, 1998లో ఎస్జీటీ ఉద్యోగాలు వచ్చినప్పటికీ ప్రజాసేవ మీద ఇష్టంతో రాజకీయాల్లోనే కొనసాగుతున్నాను. మండలంలో రెండు సార్లు ఎంపీటీసీ, రెండుసార్లు జనరల్ స్థానంలో జడ్పీటీసీగా ప్రజలు గెలిపించారు. ఒకసారి వైస్ ఎంపీపీగా, 2019 నుంచి 2024 వరకు జడ్పీ వైస్‌చైర్మన్‌గా పని చేశా.

వైస్ చైర్మన్ పదవికి న్యాయం

ఐదేళ్లపాటు జడ్పీ వైస్‌చైర్మన్‌గా పని చేయడం సంతృప్తినిచ్చింది. జడ్పీలో నాకు ఇష్టమైన అగ్రికల్చర్ కమిటీ చైర్మన్‌గా పని చేయడంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సలహాలు, జడ్పీ చైర్మన్ గుజ్జ దీపికాయుగంధర్, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిది. జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అగ్రభాగాన నిలిపేందుకు శక్తివంచన లేకుండా పని చేశాను. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డికి అన్ని రంగాలపై పట్టుంది. ఆయన ఒక ఉపాధ్యాయుడి మాదిరిగా ప్రతి అంశంపై చెప్పే పాఠాలతో నాయకులు ప్రజలకు దగ్గరవుతారు. నేను కూడా ప్రజలతో మమేకమై పనిచేయడానికి అదే కారణం. ఆయన చాలామంది నాయకులకు రాజకీయ భవిష్యత్ ఇచ్చారు.